క్లుప్తంగా

టీయూఎఫ్ ఐడీసీ నిధులతో పార్కుల అభివృద్ధి

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో రూ.32 లక్షల టీయూఎఫ్ ఐడీసీ నిధులతో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజ్, ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని 3, 4వ వార్డులతో పాటు జములమ్మ ఆలయ సమీపంలోని ప్రభుత్వ స్థలాలను మంగళవారం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. పట్టణంలో చిల్డ్రన్ పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు పాసిరిగారి విష్ణు, శ్యాం, ప్రకాశం, తౌఫిక్, హనుమంతు నాయక్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై నిర్లక్ష్యం

వనపర్తి విద్యావిభాగం: పట్టణంలో పెరుగుతున్న సమస్యలపై అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ పట్టణంలో మాల్స్ ఎదుట ఎలాంటి పార్కింగ్ సదుపాయం లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, రామస్వామి, కురుమూర్తి, కొత్త గొల్ల శంకర్ ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

అమరచింత: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారు జామున పట్టుకొని, స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ స్వాతి తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని జూరాలకు చెందిన డ్రైవర్ తెలుగు నరేష్ తన యాజమాని గుడిసె నరసింహులు ఆదేశాల మేరకు అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

అమరచింత: రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అరవింద్ అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల గ్రామ శివారులోని పాత ఇనుప సామాను గోదాం షెటర్ వద్ద మంగళవారం 6 అడుగుల కొండచిలువను గుర్తించిన యజమాని తాజుద్దీన్ స్నేక్ సొసైటీ చీర్ల కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న కృష్ణసాగర్ కొండచిలువను పట్టుకొని సంచిలో బంధించి ఫారెస్టు అధికారుల సూచన మేరకు సురక్షితంగా అడవిలో వదిలి వేశామని తెలిపారు. కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్‌సాగర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

వీపనగండ్ల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేపట్టేందుకు వెళ్తున్న సీఐటీయూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అన్యాయం అని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం సీఐటీయూ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రైవేటు బీమా సంస్థలకు ఇవ్వొద్దని కోరుతూ నిరసన చేసేందుకు వెళ్తుంటే అదుపులోకి తీసుకున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఆశన్న, మేస్త్రీల సంఘం నాయకులు మల్లేష్, కృష్ణయ్య, మద్దిలేటి, రాజు తదితరులు అన్నారు.

'లంబాడాల భేరి'ని అడ్డుకుంటాం

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించే లంబాడాల భేరి సభను అడ్డుకుంటామని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు తిరుపతినాయక్ అన్నారు. గోండులు, కోయలకు గొడవలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. రాజకీయాల కోసం బంజారాలు, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నించడం సరైన పద్ధతి కాదన్నారు.

విద్యుత్ మోటార్ వైర్ల చోరీ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని రైతులు రాంబాబు గౌడు, లింగరాజుల వీరబాబు, మండ్ల వెంకటయ్య, జుర్రు శేఖర్, ఆవుల వెంకటయ్య, రాంచందర్, జొల్లు పెద్దబాబు, బిచ్చన్న పంట పొలాల వద్ద మోటార్లకు బిగించిన కేబుల్ వైర్ల చోరీపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

యూరియా కష్టాలు తీరాలంటే..



పాన్‌గల్ సింగిల్ విండో కార్యాలయం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

- ప్రత్యామ్నాయంగా నానో
- రైతులకు అవగాహన తప్పనిసరి

పాన్‌గల్: వర్షాకాలంలో సాగు చేసిన పంటలకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా వరి పైరుకు యూరియా వాడితేనే మొక్క ఏపుగా పెరిగి దిగుబడి బాగా వస్తుంది. కానీ ఈ ఏడాది రైతుల అవసరం మేరకు సరఫరా లేకపోవడంతో సింగిల్‌విండో కార్యాలయాల ఎదుట యూరియా కోసం బారులు తీరిన ఘటనలు కోకొల్లలు. ఇందుకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్నా.. దానికి సరైన అవగాహన లేకపోవడంతో రైతులు ఆ దిశగా ఆలోచన చేయట్లేదు.

ఖర్చులో వ్యత్యాసం..

వరి పైరు మూడు నెలల కాలంలో రెండు సార్లు యూరియా చల్లుతారు. దీంతో నానో యూరియాకు, గులకల యూరియాకు రైతులు ఖర్చును సైతం బేరీజు వేసుకొని ముందుకెళ్తున్నారు. యూరియా బస్తాకు రూ.270 కాగా ఎకరాకు రెండు బస్తాలు.. చల్లినందుకు రూ.700 కూలీ కలిపి రూ.1240 అవుతుంది. నానోకు లీటరుకు రూ.225, డ్రోన్ సహాయంతో పిచికారీ చేసినందుకు రూ.500 కలిపి ఎకరాకు రూ.725 అవుతుంది. కానీ యూరియా బస్తాకు అధికంగా ఖర్చు అవుతున్నా.. అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో నానో యూరియాకే అదనంగా ఖర్చువుతున్నా రైతులు బస్తా యూరికే మొగ్గు చూపుతున్నారు.

మండలాల వారీగా..

మండలం	రైతులు	యూరియా (బస్తాలు)
పాన్‌గల్	19,917	26,819
చిన్నంబావి	11,838	21,553
వీపనగండ్ల	12,500	18,842

20 రోజులుగా తిరుగుతున్నా..

యూరియా కోసం చాలా మంది రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు సింగిల్‌విండో కార్యాలయాల్లో ఇచ్చి 20 రోజులు దాటినా నేటికీ యూరియా లభించలేదని రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు పలుమార్లు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోలు చేశారు. పలుకుబడి ఉన్న నాయకులకే యూరియా అందిస్తుండటంతోనే సామాన్య రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కానీ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి వచ్చిన 960 నానో యూరియా బాటిళ్లు వృథాగానే ఉన్నాయి.

దిగుబడి అధికం



రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతింటుంది. ప్రతి రైతు నానో యూరియా వైపు మొగ్గు చూపాలి. వరి పైరులో ఎరువులతో కలిపి పిచికారీ చేయవచ్చు. పంట ఆకులపై పడటం వల్ల ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. నానోతో నీటి, వాయు, భూమి కాలుష్యం తగ్గుతుంది. రైతులు తక్కువ ఖర్చులో అధిక దిగుబడులు పొందవచ్చు. పంట సమతుల్య పోషకాలను గ్రహించడంతో దిగుబడి పెరుగుతుంది. ఏఈఓల ద్వా రా నానో యూరియాపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటాం.

– తిప్పేస్వామి, ఏడీఏ, పాన్‌గల్

'నానో'పై అవగాహన..



రైతులు యూరియా కోసం ప్రతి నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకంతో కలిగే లాభాలు, ఖర్చు గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. ఇప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు మండలంలో ఎక్కడ కూడా నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి నానో యూరియాతో కలిగే లాభాల గురించి వివరించాలి.

– మంగదొడ్డి గాలెన్న, రైతు, పాన్‌గల్

ఫర్టిలైజర్ షాపుల్లో ఉంచాలి



మండలంలో యూరియా కష్టాలు తగ్గించేందుకు మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అందించాలి. ప్రస్తుతం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలోనే పంపిణీ చేస్తుండటంతో మండలంలోని అన్ని గ్రామాల రైతులు అక్కడే గుమికూడుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటూ, నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన పెంచాలి.

– కృష్ణయ్యగౌడు, రైతు, దావాజిపల్లి

వ్యవసాయానికి అనుబంధం 'పాడి'



డైరీఫాంలో వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శేశిరెడ్డి కొనసాగిస్తున్న డెయిరీఫాంను మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సందర్శించారు. జెర్సీ ఆవుల పోషణ కోసం తీసుకుంటున్న జాగ్రత్తలు గురించి తెలుసుకున్నారు. పాల ఉత్పత్తి, నెల ఖర్చులు, ఆదాయం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడు తూ గ్రామాల్లో రైతులు వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయం కోసం పాడి పశువులు పెంచుకోవాలని సూచించారు. దీంతో పొలాలకు సైతం నాణ్యమైన సేంద్రియ ఎరువులు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు, చంద్రశేఖర్, మతీన్, గ్రామ అధ్యక్షుడు మనీష్, కాశీనాథ్, మన్యంనాయక్, తిరుపతయ్యగౌడ్, రాజేష్‌గౌడ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

గోపాల్‌పేట: ప్రధానమంత్రి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని తాడిపర్తిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 30 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రధానమంత్రి మోదీ 11 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి గురించి గ్రామాల్లో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మండల ఇన్‌చార్జి కదిరె మధు మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నారాయణ, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మనివర్ధన్‌సాగర్, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించాలని మంత్రికి వినతి



మంత్రి వాకిటి శ్రీహరికి మొక్క అందజేస్తున్న పద్మజారెడ్డి

ఆత్మకూర్: మూలమళ్ల గ్రామానికి బీటీ రోడ్డు వేయించాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ప్రముఖ సామాజికవేత్త దేశాయి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో మూలమళ్ల గ్రామస్తులు మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. ఆత్మకూర్ నుంచి మూలమళ్ల మీదుగా జూరాల ప్రాజెక్టుకు 2016లో రోడ్డు మంజూరయినా.. నేటికీ మోక్షం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కబడ్డీ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు క్రీడామైదానం కోసం ఎకరన్నర స్థలాన్ని విరాళంగా అందించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి కబడ్డీ మ్యాట్‌కు రూ.3.50 లక్షలు నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సత్యన్న, వెంకట్రాములు, శ్రీనివాస్, నరసింహులు, రాజు గ్రామస్తులు ఉన్నారు.

పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే జీఎమ్మార్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ కమిటీ సభ్యులు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం ప్రతిష్ఠించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కొత్తకోట ముదిరాజ్ కమిటీ సభ్యులు బుధవారం భూత్పూర్ మండలంలోని కొత్త మొల్గరలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి విన్నవించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, త్వరలోనే కొత్తకోటలో పర్యటించి అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ముదిరాజ్ నూతన కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బాలయ్య, వాకిటి రాజమౌళి, నాగరాజు, రంగన్న, వాకిటి బాలరాజు, పి.రాజు, సంద రాంచంద్రయ్య, టీజీ మహేష్, గాదం పరమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

కాల్వ భూమిలో ప్రహరీ నిర్మించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ కోసం సేకరించిన భూమిలో అక్రమంగా ప్రహరీ గోడ నిర్మిస్తున్న వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలంలోని మంగనూరు మీదుగా వెళ్తున్న కల్వకుర్తి లిఫ్ట నుంచి ఖిల్లాఘనపురం మండలం కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్‌కెనాల్‌ను తవ్వారు. కాల్వ కోసం మండలంలోని సల్కెలాపురం శివారులోని సర్వే నంబర్ 78లో ఐదు గుంటలు, సర్వే నంబర్ 79లో 1.28 ఎకరాల భూమిని కాల్వ కోసం ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వం సేకరించిన భూమిలో కమిరెడ్డి సురేష్‌రెడ్డి ప్రహరీ నిర్మిస్తుండడంతో ఇరిగేషన్ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా తీరు మారకపోవడంతో మంగళవారం ఇరిగేషన్ ఏఈ శ్రీపురం లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఇటుక ధరలు తగ్గించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మదనాపురం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇటుక ధరలు తగ్గించాలని కోరుతూ మంగళవారం బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు బి.మహేందర్ నాయుడు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం వరకు ట్రాక్టర్ ఇటుకను రూ.13 వేలకు విక్రయించారని, కానీ ప్రస్తుతం డిమాండ్ బట్టి రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు పెంచారని పేర్కొన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తే ఇటుక యజమానులు భారం మోపడం సరైంది కాదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై తహసీల్దార్ స్పందిస్తూ ఇటుక బట్టి యజమానులతో చర్చించి పేదలకు న్యాయం కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రభాకర్, ఉప్పరి దేవేందర్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. దంత వైద్య నిపుణులు డా.సురేష్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారన్నారు. వైద్య శిబిరంలో 71 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమనశ్రీ, శాంతమ్మ, సతీష్‌కుమార్, మదన్‌గోపాల్, కళావతి, ఎస్తేరమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



'రైతులకు యూరియా ఇవ్వని దుస్థితి'



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: అన్నం పెట్టే రైతుకు బస్తా యూరియా ఇవ్వలేని స్థితిలో పాలకులు ఉన్నారని సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ రమేష్ విమర్శించారు. జిల్లాలో యూరియా కొరతకు నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 రోజుల నుంచి పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్ద బస్తా యూరియా కోసం రైతులు పనులు వదులుకొని తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నా పాలకులకు కురుణించట్లేదని వాపోయారు. సాగుకు సరిపడా యూరియా అందించి రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కళావతమ్మ, శ్రీరామ్, చంద్రయ్య, కురుమయ్య, ఎర్ర కురుమయ్య, ఎత్తం మహేష్, జయమ్మ, శిరీష, వంశీ, జ్యోతి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు

మున్సిపాలిటీకి చేరిన ట్రాక్టర్లు

వనపర్తి టౌన్: స్థానిక మున్సిపాలిటీలో ఇంటింటి చెత్తసేకరణలో జాప్యాన్ని నివారించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన మూడు ట్రాక్టర్లు మంగళవారం పుర కార్యాలయానికి చేరుకున్నాయి. మూడు ట్రాక్టర్ల ట్రాలీలతో కలిపి రూ.30లక్షలు వెచ్చించినట్లు అధికారులు వెల్లడించారు. వారం రోజుల క్రితం ట్రాక్టర్లు, ఆటోలు, ఇటాచీ కొనుగోలులో జాప్యం ఏర్పడుతోందని సాక్షి వెలువరించిన కథనానికి స్పందనగా అధికారులు ఆగమేఘాల మీద ప్రస్తుతం మూడు ట్రాక్టర్లను పూర్తి స్థాయి బాడీలతో ఏర్పాటు చేసి అందుబాటులోకి తెచ్చారు. మిగతా ఆటోలు, ఇటాచీలు, వచ్చేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని ఇంజినీరింగ్ విభాగం అధికారులు చెబుతున్నారు.

మహిళపై దాడి

ఖిల్లాఘనపురం: మిరపనారు విషయంలో గొడవ పెట్టుకుని తోటి మహిళపై దాడి చేసిన ఘటన మండలం షాపురంలో సోమవారం చోటు చేసుకోగా మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. షాపురం గ్రామానికి చెందిన కుంబం సాయమ్మ మనవడు చిన్నారి విజయ్, తోటి కోడలు మనెమ్మ మనవరాలు చిన్నారి సాన్వి ఇంటిపక్కన ఉన్న కుంబం లక్ష్మమ్మ తోటలో మిరప మొక్కలను పీకేశారు. ఈ విషయమై లక్ష్మమ్మ మరిది వచ్చి సాయమ్మను పరుష పదజాలంతో దూషించాడు. సాయంత్రం లక్ష్మమ్మ సైతం గొడవ పెట్టుకొని ఆగ్రహంతో సాయమ్మ తలపై రాయితో కొట్టడంతో రక్తగాయం అయ్యింది. మంగళవారం సాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు స్కీంలు ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దు

వనపర్తి రూరల్: సెస్ ద్వారా జమ అయిన నిధులు, వెల్ఫేర్ బోర్డు స్కీములు గుర్తింపు లేని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొదంటూ మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బిల్డింగ్ అండ్ నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, కురుమన్న, రాబర్ట్, బాలస్వామి, నరసింహులు, రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందివ్వాలి

వీపనగండ్ల: నిరుపేదలకు వైద్య సేవలు అందించినప్పుడే డాక్టర్ చదువులకు గుర్తింపు వస్తుందని ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన అఖిలను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాములు, శ్రీను, రాజు, నాగ రాజు, స్వాములు, అశోక్, విష్ణు, వీరబాబు ఉన్నారు.

స్వచ్ఛత పాటిద్దాం

ఆత్మకూర్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ చికిని శశిధర్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో వార్డుల అధికారులు, కార్మికులతో కలిసి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం



కొత్తకోటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



జిల్లాకేంద్రంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారు మంగళవారం గాయత్రి దేవిగా భక్తులకుదర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భవానీ మాలధారులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- ❖ వనపర్తి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, చౌడేశ్వరి ఆలయం, వేంకటేశ్వర ఆలయంలో గాయత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలోని హైస్కూల్ రోడ్డులో గల బండారు వీధిలో ఆదిత్య పరాశ్రీ శిష్యబృందం, భవానీ దీక్షాపరులు అమ్మవారి శ్లోకాలను పఠించారు.
- ❖ కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యపాశుపత హోమం, సంతాన గౌరీ వ్రతం నిర్వహించారు.
- ❖ అమరచింత పట్టణంలోని శ్రీకృష్ణనగర్ కాళీకామాత ఆలయంలో, విఘ్నేశ్వర భవాని నగర్‌లో అమ్మవారిని గామత్రిదేవీగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.
- ❖ పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, మాందాపూర్, కేతేపల్లి, అన్నారం, రాయినిపల్లి, తెల్లరాళ్లపల్లి, గోప్లాపూర్ గ్రామాల్లో అమ్మవారు గాయిత్రి దేవీగా దర్శనమిచ్చారు.
- ❖ వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల వ్యాప్తంగా అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు.
- ❖ మదనాపురం మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొత్తపల్లిలో అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- ❖ ఖిల్లాఘనపురం మండల కేంద్రంతో పాటుగా మండలంలో మానాజీపేట, ఉప్పరిపల్లి, పర్వతాపురం తదితర గ్రామాల్లో అమ్మవారు లలితాంబికదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- ❖ గోపాల్‌పేట మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో గాయత్రీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.



ఏదులలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



పామిరెడ్డిపల్లిలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమరచింతలోని విఘ్నేశ్వర భవానీనగర్‌లో..